RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక





హైదరాబాద్ | శుక్రవారం 19-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 263 పేజీలు: 4 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

‘నాన్–సీరియస్ ప్లేయర్స్’కు

## ఏపీలో చోటులేదు

- రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో రూ. 30,515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో సుమారు 30 వేల ఉద్యోగాలు రానున్నాయని అంచనా
- పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతికి చేర్చాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- ఇథనాల్, సెమీ కండక్టర్ల పరిశ్రమలను ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం
- ప్రాజెక్టులు ప్రారంభించాకే ప్రోత్సాహకాలు ఇవ్వాలని మంత్రి లోకేశ్ స్పష్టీకరణ



పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు చేరేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన 18వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ. 30,515 కోట్ల విలువైన 50 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. ఈ కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో 29,677 ఉద్యోగాలు రానున్నాయని అంచనా వేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, పరిశ్రమల స్థాపన కేవలం ధనికులకే సాధ్యమనే భావనను తొలగించి, సామాన్యులు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అనువైన వాతావరణం సృష్టించాలని స్పష్టం

- మిగతా 2వ పేజీలో

## సీబీఐ దర్యాప్తు జరగాలి

- ఈ కేసులో సీఐ ఒక్కడిని బాధ్యుడిగా చేస్తే సరిపోదు
- ఈ నేరంలో విజయవాడ సీపీ, డీజీపీకీ భాగముంది
- ఈ ఘటనకు బాధ్యులైన వారందరిపై మర్డర్ కేసు పెట్టాలి
- కొడుకు కోసం ఆ తల్లి పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగింది
- ఫొటోకు దండ వేసుకోమని సీఐ హేళన చేశారు
- ఆమె ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు చెత్తబుట్టలో పడేశారు
- సాయికృష్ణను చంపేశాక లీడర్ల ద్వారా తల్లితో బేరసారాలు
- తల్లి హైకోర్టును ఆశ్రయించడంతో పోలీసుల్లో భయం

అమరావతి: విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో లాకప్‌డెత్‌కు గురైన గిగ్ వర్కర్ సాయికృష్ణ కేసులో సీబీఐ దర్యాప్తు జరగాలని, అందుకు బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- మిగతా 2వ పేజీలో





## ప్రతి గింజా కాదు.. కోటా ‘మేరకే’!

- కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తోంది
- కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకే ఈ నిర్ణయం
- కేబినెట్ భేటీ తర్వాత మంత్రులు ఉత్తమ్, తుమ్మల, సీతక్క వెల్లడి
- ఈ ఏడాది ఏడు రకాల సన్నాలకు మాత్రమే బోనస్
- 30న మధిరలో రైతు సమ్మేళనం సభ.. రైతుభరోసా విడుదల
- ఎల్‌నినో ప్రభావం తీవ్రమవుతోంది.. తొందరపడి విత్తనాలు వేయొద్దు
- 21న నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

హైదరాబాద్: ఇకపై కేంద్ర ప్రభుత్వం నిర్దేశించే కోటా మేరకే రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేయనుంది. ఏటా కేంద్రం ఖరారు చేసే కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో నిర్దేశిత కోటా మేరకే కొనుగోళ్లు జరపాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. గురువారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి

- మిగతా 2వ పేజీలో

## ఫ్రాన్స్-భారత్ స్నేహం వర్ధిల్లాలి..

- ఫ్రాన్స్‌లో పర్యటిస్తున్న ప్రధాని మోడీ
- ప్రపంచ దేశాధినేతలతో మోడీ భేటీలు
- భారత్ స్నేహం వర్ధిల్లాలంటూ మాక్రాన్ ఆసక్తికర పోస్ట్

ప్రధాని మోడీ ఫ్రాన్స్‌లో పర్యటిస్తున్నారు. జీ 7 సదస్సులో పాల్గొనేందుకు ఫ్రాన్స్‌కు వెళ్లారు. పర్యటనలో భాగంగా ప్రపంచ దేశాధినేతలతో మోడీ సమావేశం అయ్యారు. ట్రంప్ దగ్గర నుంచి జీ 7 దేశాధినేతలంతో కీలక మంతనాలు చేశారు. ఇక తాజాగా ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్.. భారత్‌ను ఉద్దేశించి హిందీలో కీలక పోస్ట్ చేశారు. ఫ్రాన్స్–భారత్ స్నేహం వర్ధిల్లాలంటూ... ప్రధాని మోడీకి హిందీలో శుభాకాంక్షలు తెలిపారు.

- మిగతా 2వ పేజీలో



## రష్యాపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడి..



- మంటల్లో రాజధాని మాస్కో..
- ఆయిల్ రిఫైనరీతో పాటు పలు ప్రాంతాలపై దాడి..

ఉక్రెయిన్ రష్యాపై గురువారం భారీ డ్రోన్ దాడి చేసింది. కనీసం రష్యా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ కూడా ఈ దాడిని గుర్తించలేకపోయింది. ఈ దాడిలో రష్యాలోని పలు ఆయిల్ రిఫైనరీలు దెబ్బతిన్నాయి. రాజధాని మాస్కోలో ఈ డ్రోన్ దాడి విధ్వంసాన్ని సృష్టించింది. ఆయిల్ రిఫైనరీల నుంచి భారీగా

- మిగతా 2వ పేజీలో

## అనాథ పిల్లలకూ ‘తల్లికి వందనం’

- కేజీబీవీ హాస్టళ్లలో విద్యార్థినులందరికీ బంక్ బెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశం
- అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో తెలుగు అకాడమీ పుస్తకాల విక్రయానికి నిర్ణయం
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచన



2లో

## మాజీ మంత్రి కారుమూరి కుమారుడికి 14 రోజుల రిమాండ్

- గత వైసీపీ ప్రభుత్వ హయాంలోని లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్
- సునీల్‌ను అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించిన ఈడీ
- రూ.28 కోట్ల కిక్‌బ్యాకులు పొందినట్లు ఈడీ ఆరోపణ
- ఈ స్కామ్ వల్ల ప్రభుత్వానికి రూ.195 కోట్ల నష్టం వాటిల్లినట్టు అంచనా



2లో



## పీవీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

- పిల్లలతో గడిపే ప్రతిక్షణం ఆనందభరితమే
- స్వామిరామానందతీర్థలో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్

సనత్‌నగర్ (హైదరాబాద్): మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విద్యార్థులకు సూచించారు. గురువారం బేగంపేట బ్రాహ్మణవాడిలోని స్వామి రామానందతీర్థ మెమోరియల్ స్కూల్‌ను సందర్శించి ఆయన విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. అలాగే తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 16 భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన పీవీ నరసింహారావు దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని చెప్పారు.



2లో

## నేను జైల్లో ఉన్నప్పుడు.. బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు

- గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేసిన కవిత
- తాను జైల్లో ఉన్నప్పుడు కొందరు నేతలు తన వద్దకు వచ్చారన్న కవిత
- బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో వచ్చారని వెల్లడి
- ఆ ప్రతిపాదనను తాను తీవ్రంగా వ్యతిరేకించానన్న కవిత
- పార్టీ కోసం ప్రాణాలు త్యాగం చేయడానికి కూడా సిద్ధపడ్డానని వెల్లడి

## అతడు బతికి లేడు.. శవాన్ని మాయం చేశారు

- సాయికృష్ణను లాకప్ డెత్ చేశారన్న అంబటి
- తాము దీనిపై రాజకీయాలు చేయడం లేదని వ్యాఖ్య
- సీబీఐ చేత విచారణ జరిపించాలని డిమాండ్



2లో

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

## పీవీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన చూపిన మార్గంలో నడుస్తూ విద్యార్థులు జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. 2023లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రారంభించిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పిల్లలతో గడిపే ప్రతి క్షణం ఆనందాన్ని ఇస్తుందని చెప్పారు. సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యా ర్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం కూడా అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. స్వామి రామానందతీర్థ మెమోరియల్ స్కూల్‌కు అవసరమైన అదనపు తరగతి గదులు, ఆధునిక లైబ్రరీ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని కేటీఆర్ హామీనిచ్చారు. విద్యార్థులకు అండగా నిలుస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి సేవలను ప్రశంసించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు చేయూత అందించడం సమాజ బాధ్యత అని తల సాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ట్రస్ట్ కార్యక లాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ విద్యా సేవలను విస్తరింపజేస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవిని ఆయన అభినందించారు. తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం స్వచ్ఛందంగా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి నాణ్యమైన విద్యతో పాటు సరైన పోషకాహారం కూడా అవసరమని ఎమ్మెల్సీ వాణీదేవి పేర్కొన్నారు. పిల్లలకు సమతుల్య పోషకాహారం అందించినప్పుడే వారి మేధస్సు వికసిస్తుందన్నారు.

## రష్యాపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడి..

(మొదటి పేజీ తరువాయి)

మంటలు ఎగిసిపడుతున్నాయి. విమానాశ్రయం నుంచి విమాన సర్వీసుల్ని నిలిపేశారు. ఒకే వారంలో రెండోసారి ఉక్రెయిన్ రష్యా ఆయిల్ వ్యవస్థల్ని టార్గెట్ చేసింది. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ చెబుతున్న వివరాల ప్రకారం.. రష్యా వాయు రక్షణ వ్యవస్థలు రాత్రికి రాత్రే వివిధ ప్రాంతాలలో 555 ఉక్రేనియన్ డ్రోన్‌లను కూల్చివేశాయి. వాటిలో సుమారు 200 డ్రోన్‌లు రష్యా రాజధానిని సమీపిస్తుండగా అడ్డుకున్నాయి. అయినప్పటికీ, అనేక డ్రోన్‌లు నగరంపై దాడి చేయగలిగాయి. ఈ డ్రోన్ దాడుల వల్ల సదోవోద్ ప్రాంతం, బెలాయా డాచా వంటి షాపింగ్ కాంప్లెక్స్‌లు, కొన్ని నివాస భవనాలు దెబ్బతిన్నాయి. మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్, నగర ఆగ్నేయ శివార్లలో మాస్కో చమురు శుద్ధి కర్మాగారంపై అనేక డ్రోన్లు దాడి చేశాయని వెల్లడించారు. మాస్కోలోని నాలుగు ఎయిర్ పోర్టుల్లో విమాన సర్వీసులు నిలిపేశారు. ఈ దాడితో మాస్కోలోని గాజ్‌ప్రోమ్ నెఫ్ట్ చమురు శుద్ధి కర్మాగారం ధ్వంసమైంది. ఇది రాజధాని మాస్కో ప్రాంతానికి అతిపెద్ద ఇంధన సరఫరా సంస్థ. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్స్కీ జీ 7 సమావేశం కోసం ఫ్రాన్స్‌లో ఉన్న సమయంలోనే ఈ భారీ దాడి జరిగింది. జెలెన్స్కీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మక్రాన్‌తో చర్చలు జరిపారు. ప్రపంచ నాయకుల నుంచి ఉక్రెయిన్‌కు సాయం అందుతుందనే హామీ లభించిందని జెలెన్స్కీ అన్నారు.

## అతడు బతికి లేడు.. శవాన్ని మాయం చేశారు

ఏపీలో రౌడీ షీటర్ సాయికృష్ణ మిస్సింగ్ కేసుపై రాజకీయ కలకలం రేగింది. ఇప్పటికే ఈ వ్యవహారంలో సీఐ నాగరాజుపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసి విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ఇష్యూపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రెస్‌మీట్ పెట్టి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇది కేవలం మిస్సింగ్ కేసు కాదని, లాకప్ డెత్ చేసి శవాన్ని మాయం చేశారంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. సాయికృష్ణ కోసం పోలీసులు వెతుకుతున్నామని చెబుతున్న మాటల్లో వాస్తవం లేదని, అతడు బతికి లేడని అంబటి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము దీనిపై ఎలాంటి రాజకీయాలు చేయడం లేదని, కొడుకు కోసం తల్లడిల్లుతున్న ఒక తల్లి ఆవేదనను మాత్రమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నామని చెప్పారు. ప్రభుత్వం ఆదేశించిన సీనియర్ ఐపీఎస్ విచారణపై అంబటి నమ్మకం వ్యక్తం చేయలేదు. "గ్యాంగ్ వార్‌లోనే సాయికృష్ణ ఏమైపోయాడో తెలియకుండా పోయాడు" అని పోలీసులు ముందే రాసుకున్న రిపోర్ట్‌నే విచారణలో కూడా ఇస్తారని ఎద్దేవా చేశారు. ఒక వ్యక్తిని హత్య చేయడం మొదటి నేరమైతే.. ఆధారాలు దొరకకుండా డెడ్ బాడీని మాయం చేయడం రెండో నేరమని అంబటి దుయ్యబట్టారు. ఈ కృష్ణలంక పీఎస్ ఉదంతంపై పూర్తి నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని, అలాగే విజయవాడ పోలీస్ కమిషనర్‌ను సస్పెండ్ చేసి బాధ్యులందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## అనాథ పిల్లలకూ 'తల్లికి వందనం'

రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఈ ఘనత సాధించిన అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం, అభ్యసన సామర్థ్యాల పెంపు, మౌలిక వసతుల కల్పనపై పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కడప మోడల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభమైన 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' కిట్ల పంపిణీని మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, రాష్ట్రంలోని 430 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుకుంటున్న 1,06,360 మంది విద్యార్థినులకు సౌకర్యవంతమైన వసతి కల్పించేందుకు 53,180 బంక్ బెడ్లను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఈ సదుపాయాన్ని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలకు కూడా విస్తరించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 2,03,430 మంది విద్యార్థులకు కూడా కిట్లు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు సైతం ప్రభుత్వ పథకాల ఫలాలు అందాలన్న లక్ష్యంతో మంత్రి లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'తల్లికి వందనం' పథకాన్ని అనాథ పిల్లలకు కూడా వర్తింపజేయాలని, ఇందుకోసం వారి గార్డియన్ల వివరాలను కచ్చితత్వంతో సేకరించాలని ఆదేశించారు. ఒకవేళ ఎవరూ లేని పక్షంలో, ఆ నిధులను నేరుగా జిల్లా కలెక్టర్‌కు పంపి, వారి ద్వారా పిల్లలకు చేరేలా చూడాలన్నారు. అంతేకాకుండా, అనాథ పిల్లల పేరుపై బ్యాంకు ఖాతాలు తెరిచి, పథకం నిధులను నేరుగా జమ చేయాలని సూచించారు. వారి చదువు పూర్తయ్యాక ఆ మొత్తాన్ని వారు స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఒక శాశ్వత విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు.

# 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. ఈ ఫలాలు పేద, మధ్య తరగతికి ఉద్యోగాల రూపంలోనే కాకుండా, వారు కూడా కంపెనీలు స్థాపించేలా ప్రోత్సహించాలి. స్టార్టప్‌లకు పెద్దపీట వేయాలి. దీనికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీఐహెచ్ (ఆర్టీఐహెచ్) సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు ఆకర్షించాలి" అని దిశానిర్దేశం చేశారు. ప్రాజెక్టులకు అనుమతులు పొందాక వెంటనే పనులు ప్రారంభించని సంస్థల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదని హెచ్చరించారు. ఇథనాల్ ఆధారిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలని, దీనివల్ల రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు ఇంధన దిగుమతుల భారం తగ్గుతుందని సీఎం అన్నారు. 40 శాతం ఇథనాల్ బ్లెండింగ్‌కు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో ఇథనాల్ తయారీ పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు. అదేవిధంగా, సెమీ కండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, లీథియం అయాన్, ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీల ఉత్పత్తిని ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతుల కోసం ప్రత్యేకంగా మైక్రో ఇరిగేషన్ ఎక్విప్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేయాలని, దీనివల్ల రైతులకు తక్కువ ధరకే పరికరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

### పర్యాటకం, మౌలిక వసతులపై దృష్టి

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు టెంపుల్ టూరిజం, బీచ్ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని, హార్సిలీ హిల్స్‌లో మంచి రిసార్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. పురాతన స్వర్ణగిరిగా పేరున్న జొన్నగిరి గోల్డ్ మైన్ ఉత్పత్తిని వేగవంతం చేయాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల వద్ద కార్మికులకు అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలు చేపట్టాలని, ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను ఆటోమేషన్ చేసి రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ తయారీ కేంద్రాన్ని వేగంగా పూర్తి చేయాలని, బెంగళూరు-పుట్టపర్తిని ఏరోస్పేస్, డిఫెన్స్ కారిడార్‌గా మార్చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ కీలక సూచనలు చేశారు. భూ కేటాయింపులు పొందిన కంపెనీలు ప్రాజెక్టులను ప్రారంభించిన తర్వాతే ప్రోత్సాహకాలు, రాయితీలు అమలు చేయాలని స్పష్టం చేశారు. "ప్రాజెక్టులు వేగంగా ప్రారంభమైతేనే జీఎస్టీ రూపంలో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. అప్పుడు ప్రోత్సాహకాలు ఇవ్వడం సమంజసంగా ఉంటుంది" అని అభిప్రాయపడ్డారు. స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని, ఆంధ్రా యూనివర్సిటీలో రేర్ ఎర్త్ మినరల్స్‌పై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీబీఐ దర్యాప్తు జరగాలి

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. ఈ కేసులో విజయవాడ కమిషనర్‌తో పాటు, రాష్ట్ర డీజీపీకి కూడా ప్రమేయం ఉందన్నారు. కేవలం కంటి తుడుపుగా సీఐని సస్పెండ్ చేశారని, విజయవాడ సీపీ, డీజీపీతో సహా బాధ్యులందరిపై మర్డర్ కేసు పెట్టి శిక్షించాలని తేల్చి చెప్పారు. విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో లాకప్‌డెత్‌కు గురైన గాదె సాయికృష్ణ తల్లి, కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. కృష్ణలంకలో ఉంటున్న వారి ఇంటికి వెళ్లి జరిగిన దారుణం గురించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన అక్కడే మీడియాతో మాట్లాడారు. విజయవాడ నడిబొడ్డున, అంటే రాష్ట్రానికి రాజధాని ప్రాంతం. ఇక్కడి నుంచి కూతవేటు దూరంలోనే ముఖ్యమంత్రి నివాసం. ఇక్కడి నుంచి కూతవేటు దూరంలోనే డీజీపీ కార్యాలయం. విజయవాడలోనే కమిషనరేట్ కూడా ఉంది. ఇక్కడే ఏసీపీ పరిధి. ఇదే పరిధిలోనే కృష్ణలంక పోలీసు స్టేషన్ ఉంది. ఇదే పోలీసు స్టేషన్ పరిధిలోనే ఈ తల్లి (జగన్ పక్కనే ఉన్న సాయికృష్ణ తల్లి) ఎంత దారుణంగా ఈ ఘటన జరిగిందో చెబుతూ రోదిస్తున్న దృశ్యం కనిపిస్తోంది. ప్రతి ఒక్కరినీ ఒకటే ఆలోచన చేయమని అడుగుతున్నా. చంద్రబాబు నాయుడు దగ్గరుండి ప్రోత్సహిస్తున్న కొంత మంది పోలీసులు, వీరు చేసే పనుల వల్ల ఈ రాష్ట్రంలో ఏదైనా అన్యాయం జరిగితే పోలీసు స్టేషన్‌కు వెళ్లడానికి భయపడే పరిస్థితి నెలకొంది. అలా ఈ రాష్ట్రంలో పరిపాలన సాగుతోంది. అందరూ కూడబలుక్కుని ఒకరినొకరు ఎలా వెనకేసుకు వస్తున్నారో చెప్పడానికి ఇదే నిదర్శనం. 'పోలీసులు చెబుతున్నట్లు నా కొడుకు దోపిడీలు, దొంగతనాలు చేసి కోట్లు గడిస్తే, ఒక గిగ్ వర్కర్‌గా ఎందుకు పని చేస్తాడు బాబూ..' అని ఆ తల్లి తన గోడు వెళ్లబోసుకుంది. ఆ కుటుంబం పరిస్థితి అంత దారుణంగా ఉంది. అన్న పోలీసులు ఆ రోజు (మే 9) నుంచే సాయికృష్ణ తల్లి పోలీసుస్టేషన్ చుట్టూ తిరిగితే, 'నీ కొడుకు ఫొటోకు దండ వేసుకో..' అంటూ ఈ తల్లిని సీఐ హేళనగా మాట్లాడారు.

## నేను జైల్లో ఉన్నప్పుడు.. బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. ఇటీవల బీఆర్ఎస్‌తో తెగదెంపులు చేసుకుని, సొంతంగా తెలంగాణ రక్షణ సేన పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన కల్వకుంట్ల కవిత.. గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేశారు. ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బీఆర్ఎస్ అనే పార్టీ మనుగడలో ఉందంటే దానికి కారణం తానేనని స్పష్టం చేశారు. తాను ఢిల్లీ లిక్కర్ కేసులో జైల్లో ఉన్న సమయంలో.. బీఆర్ఎస్ పార్టీని తీసుకెళ్లి బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో కొంతమంది నేతలు తన వద్దకు వచ్చారని కవిత వెల్లడించారు. ఆ ప్రతిపాదన వినగానే తాను తీవ్రంగా వ్యతిరేకించానని, విలీనానికి అస్సలు ఒప్పుకోకుండా స్ట్రాంగ్‌గా నిలబడ్డానని కవిత చెప్పారు.

## ఫ్రాన్స్-భారత్ స్నేహం వర్ధిల్లాలి..

(మొదటి పేజీ తరువాయి)

ఫ్రాన్స్-భారతదేశం మధ్య ఉన్న స్నేహబంధం మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ మాక్రాన్ హిందీలో ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో సహకారం మరింత విస్తరించాలనే సందేశాన్ని ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ప్రధాని మోడీకి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, ప్రతినిధులు భారత ప్రధానికి హిందీలో అభినందనలు తెలియజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారత్-ఫ్రాన్స్ సంబంధాలు గత కొన్ని సంవత్సరాలుగా మరింత బలోపేతమవుతున్నాయి. రక్షణ, అంతరిక్షం, సాంకేతికత, వాణిజ్యం, విద్య, ఆవిష్కరణల వంటి అనేక రంగాల్లో ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయి. ఇటీవల ప్రారంభమైన 'ఇండియా-ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్' కార్యక్రమం కూడా ఈ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తోంది. ప్రధాని మోడీ ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా వివాటెక్ (ఎఱఙుఙవఎష్ట్ర) వంటి అంతర్జాతీయ సాంకేతిక వేదికల్లో పాల్గొని భారత్‌లోని ఆవిష్కరణలు, స్టార్టప్ వ్యవస్థ సామర్థ్యాలను ప్రపంచానికి పరిచయం చేశారు. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్ నుంచి వచ్చిన స్నేహపూర్వక శుభాకాంక్షలు ఇరు దేశాల మధ్య ఉన్న విశ్వాసం, స్నేహానికి నిదర్శనంగా నిలిచాయి. భారత్-ఫ్రాన్స్ స్నేహబంధం భవిష్యత్తులో మరింత బలపడుతూ ప్రపంచ వేదికపై కీలక భాగస్వామ్యంగా కొనసాగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

## మాజీ మంత్రి కారుమూరి కుమారుడికి 14 రోజుల రిమాండ్

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణం కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్ కుమార్‌కు హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల అనంతరం అధికారులు ఆయన్ను చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. జూన్ 18న సునీల్ నివాసం, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆయన్ను అరెస్ట్ చేశారు. తన తండ్రి పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆ పలుకుబడిని ఉపయోగించి మద్యం రవాణా కాంట్రాక్టుల ద్వారా సునీల్ భారీగా లబ్ధి పొందారని, తద్వారా మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని ఈడీ ఆరోపిస్తోంది. విచారణ సందర్భంగా, సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన సందీప్, ప్రతాప్ రెడ్డిలతో సంబంధం ఉన్న సంస్థలకు కాంట్రాక్టులు అప్పగించడంలో భారీ అవకతవకలు జరిగాయని ఈడీ తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఈ వ్యవహారంలో సునీల్ సుమారు రూ.28 కోట్ల మేర కిక్‌బ్యాకులు అందుకున్నారని, మరో రూ.7 కోట్ల విలువైన కుటుంబ లావాదేవీలను గుర్తించామని తెలిపారు. ఈ కుంభకోణం కారణంగా ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.195 కోట్ల నష్టం వాటిల్లిందని ఈడీ అభియోగాలు మోపింది.

# ప్రతి గింజా కాదు.. 'కోటా మేరకే'!

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన అనధికార మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్కతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా.. రైతులు పండించిన ప్రతి గింజను కొంటామని ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విషయం విలేకరులు ప్రస్తావించగా.. పంట ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసే యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉండదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు బదులిచ్చారు. మిర్చి, పత్తి, ఇతర పంటల ఎగుమతి కేంద్రం వల్లే సాధ్యమని స్పష్టం చేశారు. ఇందుకోసమే గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎఫ్‌సీఐ, సీసీఐ, నాఫెడ్ సంస్థలను నెలకొల్పిందని గుర్తు చేశారు. పంటల కొనుగోలు బాధ్యతల నుంచి తప్పుకోవడానికి కేంద్రం ప్రయత్నిస్తుండడంతో ఒత్తిడి పెంచడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో పండించే అన్ని రకాల పంటలను ఎంఎస్‌పీతో పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావం తీవ్రమవుతోందని, ప్రధానంగా తెలంగాణ, ఏపీపైనే అధిక ప్రభావం ఉండబోతోందంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని తుమ్మల చెప్పారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని, కాబట్టి మొదటి వర్షం పడగానే తొందరపాటుతో విత్తనాలు నాటవద్దని రైతులకు సూచించారు. కనీసం 7 సెం.మీ.ల వర్షం కురిస్తేనే విత్తనాలు మొలకెత్తేందుకు సరిపడ తేమ లభిస్తుందని చెప్పారు. మండల వ్యవసాయ అధికారులు చేసే సూచనలను రైతులు పాటించాలని కోరారు. సన్న ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్న బోనస్‌ను ఈ ఏడాది ఏడు రకాల సన్నాలకు మాత్రమే ఇవ్వాలని మంత్రుల సమావేశం నిర్ణయించింది. బీపీటీ--5204, ఆర్ఎన్ఆర్--15048,హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం--1638, డబ్ల్యూజీఎల్--44, కేఎన్ఎం--7715.. ఈ ఏడు రకాల సన్నాలకు మాత్రమే బోనస్ వర్తిస్తుంది. రాష్ట్రంలో సన్నాలు పండించే 83 శాతం రైతులు ఈ రకాలనే పండిస్తున్నారని తుమ్మల చెప్పారు. మార్కెట్ డిమాండ్, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వీటిని పండిస్తే ప్రభుత్వం కొనుగోలు చేయకపోయినా రైతులు మార్కెట్లో విక్రయించుకోవచ్చని అన్నారు.

### రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

గతంలో ఎన్నడూ లేని విధంగా యాసంగిలో రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో ఇప్పటికే దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే కేంద్రం మన రాష్ట్రం నుంచి తక్కువ ధాన్యాన్ని సేకరించటంపై కేబినెట్ ఆందోళన వ్యక్తం చేసిందని చెప్పారు. ఖమ్మం జిల్లా మధిరలో ఈ నెల 30న భారీ స్థాయిలో రైతు సమ్మేళనం సభ ఏర్పాటు చేసి ఆ వేదిక నుంచి వానాకాలం పంటల సాగుకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. వానాకాలం సీజన్‌కు రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాల్సిందిగా కేంద్రానికి మళ్లీ విజ్ఞప్తి చేయాలని నిర్ణయించినట్టు ఉత్తమ్ తెలిపారు. ఇందుకోసం త్వరలో ఇతర మంత్రులతో కలిసి ఢిల్లీ వెళతామని తుమ్మల చెప్పారు. గత ఏప్రిల్, మే నెలల్లో 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి కేటాయించి, లక్ష మెట్రిక్ టన్నులు కూడా విడుదల చేయలేదని విమర్శించారు. రామగుండం ఫ్యాక్టరీలో ఉత్పత్తి అవుతున్న ఎరువులను మధ్యప్రదేశ్, బిహార్‌కు తరలిస్తున్నారని, ఇకపై అధ్యధిక కోటాను రాష్ట్రానికే కేటాయించాలని డిమాండ్ చేశారు. 'మెట్రో రైలు రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి మంత్రివర్గం విజ్ఞప్తి చేస్తోంది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి ఒప్పందం ప్రకారం రావాల్సిన రుణాన్ని వెంటనే మంజూరు చేయించాలని కోరుతున్నాం. రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలందరూ మెట్రో విస్తరణకు సహకరించాలి..' అని ఉత్తమ్ కోరారు. ఈ నెల 21న రాష్ట్రంలోని 2,008 పరీక్ష కేంద్రాల్లో జరగనున్న నీట్ పరీక్షకు 2.95 లక్షల మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఈ విద్యార్థులందరికీ (హాల్ టికెట్లు చూపాలి) ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని నిర్ణయించినట్టు మంత్రి తెలిపారు.




# పిల్లలతో గడిపే ప్రతి క్షణం ఆనందదాయకం: కేటీఆర్

### ఆధునిక లైబ్రరీ, అదనపు తరగతి గదుల నిర్మాణానికి పూర్తి సహకారం

**హైదరాబాద్, జూన్ 18:** పిల్లలతో గడిపే ప్రతి క్షణం ఆనందాన్ని ఇస్తుందని, సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం బేగంపేట బ్రాహ్మణవాడిలోని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌ను కేటీఆర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా 2023లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రారంభమైన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యారంగ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సంక్షేమానికి దోహదపడే కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు. స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్ అభివృద్ధికి అవసరమైన అదనపు తరగతి.

# మోసాల ఆరోపణలతో వ్యక్తిపై ఫిర్యాదులు.. బాధితుల ఆవేదన



మదనపల్లి, జూన్ 18:లి అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన ఓ వ్యక్తిపై పలువురు బాధితులు మోసపూరిత కార్యకలాపాల ఆరోపణలు చేస్తూ మీడియా ముందుకు వచ్చారు. పూజలు, గుప్తనిధులు, దోష నివారణ పేర్లతో డబ్బులు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారని ఆరోపించారు. బాధితుల కథనం ప్రకారం, మదనపల్లిలోని శివాజీనగర్‌కు చెందిన మోహన కృష్ణ అనే వ్యక్తి కొన్నేళ్ల క్రితం తన వ్యక్తిగత గుర్తింపును మార్చుకొని మధుశ్రీ పేరుతో కార్యకలాపాలు నిర్వహించడం ప్రారంభించాడు. అనంతరం పలు ప్రాంతాల్లో ప్రజలతో పరిచయాలు పెంచుకుని వివిధ కారణాలు చూపుతూ డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంట్లో దోషాలు, ప్రేతాత్మల ప్రభావం, గుప్తనిధుల సాధన వంటి అంశాలను ప్రస్తావిస్తూ పలువురి నుంచి భారీ మొత్తంలో నగదు తీసుకున్నట్లు బాధితులు చెబుతున్నారు. అంతేకాకుండా వివాహ వేడుకలు, ఇతర శుభకార్యాలకు వెళ్లి దిష్టి తొలగింపు పేరుతో డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఒక గుంపును ఏర్పాటు చేసుకుని పలువురిని బెదిరింపులకు గురి చేసినట్లు కూడా బాధితులు పేర్కొన్నారు. డబ్బులు ఇవ్వకపోతే రాజకీయ నాయకులు, పోలీసులతో సంబంధాలు ఉన్నాయని చెప్పి భయపెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల కొందరు బాధిత కుటుంబాలు మీడియా ముందుకు వచ్చి తమ అనుభవాలను వెల్లడించడంతో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. దాదాపు 13 కుటుంబాలు మోసపోయినట్లు ఒక బాధిత మహిళ ఆరోపించారు. ఈ ఆరోపణలపై అధికారుల దృష్టికి విషయం వెళ్లినట్లు సమాచారం. అయితే ఆరోపణలపై సంబంధిత వ్యక్తి స్పందన తెలియాల్సి ఉంది.

# న్యాయమూర్తుల నియామకాలు.. తెరపైకి మళ్లీ స్థానికత అంశం

**హైకోర్టు జడ్జీల నియామకాల్లో స్థానికులకే అవకాశం ఇవ్వాలని డిమాండ్**

**హైకోర్టు వద్ద ధర్నా చేపట్టిన తెలంగాణ న్యాయవాదులు**

**స్థానికేతరుల పేర్లను పరిశీలించవద్దంటూ ఏకగ్రీవ తీర్మానం**

**ఏపీకి చెందిన న్యాయవాదుల పేర్లు పరిశీలనలో ఉన్నాయని ఆందోళన**

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో స్థానిక న్యాయవాదులకే ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ (౧ఎజాూూ) నిరసన చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం హైకోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. న్యాయమూర్తుల పోస్టుల కోసం స్థానికేతరుల పేర్లను పరిశీలించడాన్ని నిరసిస్తూ ఈ ఆందోళన చేపట్టారు. గత నెల 15న జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు న్యాయవాదులు వెల్లడించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. సురేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో, భవిష్యత్తులో చేపట్టే న్యాయమూర్తుల నియామకాలకు కేవలం తెలంగాణకు చెందిన వారి పేర్లనే సిఫార్సు చేయాలని సుప్రీంకోర్టు, హైకోర్టు కొలీజియంలను కోరారు. ఈ అంశంపై కేంద్ర న్యాయశాఖ మంత్రి, తెలంగాణ ముఖ్యమంత్రి, గవర్నర్ వంటి రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారికి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# కేబినెట్ కీలక నిర్ణయాలు.. జూన్ 30న రైతు భరోసా నిధుల విడుదల

**హైదరాబాద్, జూన్ 18:** రాష్ట్ర రైతులకు ఊరటనిచ్చేలా వానాకాలం రైతు భరోసా నిధులను జూన్ 30న విడుదల చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. మధిరలో జూన్ 30న నిర్వహించనున్న రైతు సమ్మేళనంలో ముఖ్యమంత్రి రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. రైతులకు ప్రోత్సాహకంగా ఏడు రకాల సన్న ధాన్యాలకు బోనస్ ఇవ్వాలని కూడా కేబినెట్ నిర్ణయించినట్లు చెప్పారు. మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో కొనుగోలు చేసిన మొత్తం ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం సేకరించాలని కేబినెట్ సమావేశంలో డిమాండ్ చేసినట్లు మంత్రి తెలిపారు. ఎరువుల కొరతను దృష్టిలో ఉంచుకుని తెలంగాణకు కేటాయించాల్సిన ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. అలాగే రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యూరియాలో అధిక భాగాన్ని తెలంగాణకు కేటాయించాలని విజ్ఞప్తి




చేసినట్లు వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్రం అనుమతులు ఇవ్వడంతో పాటు ఐఆర్ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రుణాలను విడుదల చేయాలని కేబినెట్ కోరినట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి ప్రాజెక్టుల అనుమతుల విషయంలో సహకరించాలని బీజేపీ ఎంపీలకు పిలుపునిచ్చారు. ఇకపై కేబినెట్ సమావేశాలను డిజిటల్ విధానంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. జూన్ 21న నిర్వహించనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. వీబీ-జీ ర్యామ్‌జీ అంశంపై అధ్యయనం చేసేందుకు మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డితో కూడిన కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను పరిశీలించి జూన్ 25లోపు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

# హిల్ట్ పాలసీపై మళ్లీ వివాదం..

### అలిండ్ భూముల వ్యవహారంపై ప్రశ్నలు

### 118 ఎకరాల భూముల వినియోగంపై చర్చ.. ప్రభుత్వంపై విమర్శలు




**హైదరాబాద్:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) సమీపంలోని అల్యూమినియం ఇండస్ట్రీస్ లిమిటెడ్ (అలిండ్) భూముల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. హిల్ట్ (HILT) పాలసీ అమలు నేపథ్యంలో ఈ భూముల భవిష్యత్ వినియోగంపై రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చ జరుగుతోంది. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం, గోపన్‌పల్లి గ్రామ పరిధిలోని అలిండ్ పరిశ్రమ కోసం 1960లలో దాదాపు 45 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అనంతరం పరిశ్రమ విస్తరణ కోసం ప్రభుత్వం భూసేకరణ ద్వారా మరో 53.13 ఎకరాలను కేటాయించింది. పరిశ్రమ విస్తరణ, ఉత్పత్తి పెంపు, ఉపాధి కల్పన వంటి షరతులతో ఈ భూములను అప్పగించినట్లు చెబుతున్నారు. కాలక్రమేణా పరిశ్రమ కార్యకలాపాలు నిలిచిపోవడంతో భూముల యాజమాన్యంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం ఈ భూములు ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్నాయని, కొంతకాలంగా సినిమా షూటింగ్‌ల కోసం వినియోగిస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో హిల్ట్ పాలసీ కింద ఈ భూములను రియల్ ఎస్టేట్ అభివృద్ధికి వినియోగించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విమర్శకుల అభిప్రాయం ప్రకారం, పరిశ్రమల విస్తరణ కోసం కేటాయించిన భూములను వాణిజ్య, నివాస ప్రాజెక్టులకు మళ్లించడం పాలసీ అసలు ఉద్దేశానికి విరుద్ధమని పేర్కొంటున్నారు. అలిండ్ భూములతో పాటు సమీపంలోని హెచ్‌సీయూ భూములకు సంబంధించిన వివాదాస్పద ప్రాంతాలను కూడా కలుపుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న వాదనలు ఉన్నాయి. ఇక హిల్ట్ పాలసీ లక్ష్యం కాలుష్యకారక పరిశ్రమలను నగర శివార్లకు తరలించడం కాగా, ప్రస్తుతం ఉత్పత్తి కార్యకలాపాలు లేని అలిండ్ భూములకు ఈ పాలసీని వర్తింపజేయడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పరిశ్రమ విస్తరణ, ఉపాధి కల్పన వంటి షరతులు నెరవేరకపోతే భూములను తిరిగి స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని నిపుణులు గుర్తు చేస్తున్నారు. ఈ అంశాన్ని గతంలో అసెంబ్లీలో కూడా బీఆర్ఎస్ సభ్యులు ప్రస్తావించారు. ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై వివిధ వర్గాలు సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. అలిండ్ భూముల భవిష్యత్ వినియోగం, హిల్ట్ పాలసీ అమలు, ప్రభుత్వ నిర్ణయాలపై స్పష్టత ఇవ్వాలని ప్రతిపక్షాలు, మేధావులు డిమాండ్ చేస్తున్నారు. పరిశ్రమల శాఖ నుంచి తుది నిర్ణయం వెలువడిన తర్వాత ఈ వ్యవహారంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# చంద్రబాబు పాలనకు త్వరలో ముగింపు: జగన్



తాడేపల్లి, జూన్ 18:లి రాష్ట్రంలో ప్రజలు అన్యాయమైన పాలనను భరిస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. త్వరలోనే ఈ పాలనకు ముగింపు పలుకుతారని ప్రజలు నిర్ణయిస్తారని ఆయన అన్నారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రంపచోడవరం నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో జగన్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో విధ్వంసకర పాలన కొనసాగుతోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని విమ్మంచారు. ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేస్తూ ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం చీకటి పరిస్థితులు ఉన్నప్పటికీ త్వరలో ప్రజలకు మంచి రోజులు వస్తాయని పేర్కొన్నారు. మరో ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు జగన్ వెల్లడించారు. ప్రజల సమస్యలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు పోరాడాలని సూచించారు. పోలవరం ముంపు ప్రాంతాల బాధితులకు పరిహారం చెల్లింపుల్లో వివక్ష కొనసాగుతోందని ఆరోపిస్తూ, ఆ అంశంపై పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని పొందిందని జగన్ పేర్కొన్నారు.

# నూతన తహసీల్దార్ ఆంటోనీకి కాంగ్రెస్ నేతల ఘన సత్కారం

### శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, కౌన్సిలర్లు

**జిన్నారం, జూన్ 18 ( నేటి ప్రస్థానం ):** జిన్నారం మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆంటోనీని కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా పనిచేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ తహసీల్దార్ ఆంటోనీకి శుభాకాంక్షలు తెలియజేశారు. మండల ప్రజల సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆంటోనీ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సేవలను సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిన్నారం కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# గుమ్మడిదలలో వైద్య సంస్థలపై వైద్యశాఖ ఉక్కుపాదం

## అనుమతులు లేని ఆస్పత్రులు, డయాగ్నొస్టిక్ కేంద్రాలపై జరిమానాలు -- రెండు సంస్థలు సీజ్

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యశాఖ హెచ్చరిక








**గుమ్మడిదల, జూన్ 18 ( నేటి ప్రస్థానం ):** ప్రజారోగ్య పరిరక్షణ, వైద్య సంస్థల నియంత్రణ మరియు ప్రభుత్వ నిబంధనల అమలులో భాగంగా సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల పరిధిలోని పలు ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్ కేంద్రాలపై జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా వైద్యశాఖ ప్రోగ్రాం ఆఫీసర్ (ఎంసీహెచ్) డాక్టర్ కె. నాగనిర్మల ఆధ్వర్యంలో, పీసీపీఎన్‌డీటీ విభాగ అధికారి రవితో కలిసి చేపట్టిన ఈ తనిఖీల్లో పలు నిబంధనల ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చాయి. తనిఖీల సందర్భంగా అన్నారం గ్రామంలోని బీబీఎల్ హాస్పిటల్ ఒకే ఎంబీబీఎస్ వైద్యునితో 24 గంటల ఆస్పత్రి నిర్వహణకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నట్లు గుర్తించారు. అయితే, నిబంధనల ప్రకారం అవసరమైన అర్హతలు, సిబ్బంది మరియు మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఆస్పత్రి దరఖాస్తును అధికారులు రద్దు చేశారు. అవసరమైన పత్రాలతో క్లినిక్ అనుమతి కోసం తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తూ, అధికారిక అనుమతులు లభించే వరకు ఓపీ సేవలను నిలిపివేయాలని ఆదేశించారు. అదే గ్రామంలోని సైనిస్ డెంటల్ ల్యాండ్ ఇంప్లాంట్ క్లినిక్ ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు రూ.10,000 జరిమానా విధించారు. క్లినిక్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి, తక్షణమే సంబంధిత అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించారు. అన్నారం గ్రామంలోని అపోలో డయాగ్నొస్టిక్స్ అవసరమైన అనుమతులు లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తేలడంతో రూ.10,000 జరిమానా విధించారు. అంతేకాకుండా కేంద్రాన్ని సీజ్ చేసి, అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించి అధికారిక అనుమతులు పొందిన తర్వాత మాత్రమే తిరిగి కార్యకలాపాలు ప్రారంభించాలని స్పష్టం చేశారు. దోమడుగు లోని అజయ్ హాస్పిటల్, కేవలం అజయ్ పాలీ క్లినిక్ పేరుతో మాత్రమే అనుమతి పొందినప్పటికీ, మూడు పడకలతో ఇన్‌పేషెంట్ సేవలు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది. అనుమతులకు విరుద్ధంగా ఆస్పత్రి నిర్వహణ కొనసాగిస్తున్నందుకు నోటీసులు జారీ చేయడంతో పాటు రూ.10,000 జరిమానా విధించారు. బొంతపల్లిలోని సృజన హాస్పిటల్ అనుమతి ప్రక్రియ పరిశీలన దశలో ఉండగానే వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తనిఖీల్లో అర్హత లేని ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్స్ విధులు నిర్వహించడం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, పరిశుభ్రత లోపాలు వంటి అనేక అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. రోగుల భద్రతకు ముప్పు కలిగించే పరిస్థితులు ఉన్నట్లు తేలడంతో ఆస్పత్రిని సీజ్ చేసి రూ.10,000 జరిమానా విధించారు. ఇక ప్రియాంక డయాగ్నొస్టిక్ మరియు స్టార్ డయాగ్నొస్టిక్ కేంద్రాలు తనిఖీల సమయంలో మూసివేసి ఉండటంతో సంబంధిత యాజమాన్యాలను సంప్రదించిన అధికారులు, అవసరమైన అనుమతుల కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్ కేంద్రాలు తప్పనిసరిగా చట్టబద్ధమైన అనుమతులు పొందాలని, అర్హత కలిగిన వైద్య మరియు సాంకేతిక సిబ్బందిని నియమించాలని సూచించారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత ప్రమాణాలు మరియు ఇతర నియంత్రణ నిబంధనలను కచ్చితంగా పాటించాలని హెచ్చరించారు. ప్రజారోగ్యానికి విఘాతం కలిగించే విధంగా నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



# గుమ్మడిదల అభివృద్ధికి మరో ముందడుగు

## రూ.3 కోట్ల అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

**గుమ్మడిదల, జూన్ 19 ( నేటి ప్రస్థానం ):** గుమ్మడిదల మున్సిపాలిటీని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లే క్రమంలో పలు వార్డుల్లో చేపట్టనున్న సుమారు రూ.3 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు నేడు (శుక్రవారం) శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరై పనులను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ దశరథ్, వార్డు కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి చైర్మన్ కుమార్ గౌడ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. శంకుస్థాపన జరగనున్న ప్రాంతాల్లో చేపట్టిన ఏర్పాట్లపై అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. రహదారులు, డ్రైనేజీలు, పారిశుద్ధ్య సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా గుమ్మడిదలను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు కత్తుల రమేష్, సురభి కుమార్ గౌడ్, చూర్ణం చక్రపాణి, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు. ఎమ్మెల్యే జీఎంఆర్ పర్యటన విజయవంతం అయ్యేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

# మంబాపూర్‌లో కలుషిత తాగునీటి కలకలం

## తాగునీటి ట్యాంక్‌లో రెండు కోతుల మృతి.. గ్రామస్థుల్లో తీవ్ర ఆందోళన

## నిర్వహణలో నిర్లక్ష్యమే కారణమంటూ పాలకవర్గంపై ప్రజల ఆగ్రహం

## వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని డిమాండ్





**గుమ్మడిదల, జూన్ 18 ( నేటి ప్రస్థానం ):** గుమ్మడిదల మండలం మంబాపూర్ గ్రామంలో తాగునీటి ట్యాంక్‌లో రెండు కోతులు మృతి చెంది కుళ్లిపోయిన ఘటన వెలుగులోకి రావడంతో గ్రామంలో తీవ్ర కలకలం రేగింది. గ్రామ ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి ట్యాంక్‌లో ఈ ఘటన చోటుచేసుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల కథనం ప్రకారం, గత కొద్ది రోజులుగా తాగునీటి నుంచి భరించలేని దుర్వాసన వస్తుండటంతో అనుమానం వ్యక్తం చేశారు. ట్యాంక్‌ను పరిశీలించగా అందులో రెండు కోతుల కళేబరాలు కుళ్లిపోయిన స్థితిలో కనిపించాయి. కోతుల మృతదేహాలు పూర్తిగా కుళ్లిపోవడంతో వాటి చర్మ భాగాలు, వెంట్రుకలు నీటిలో కలిసిపోయినట్లు స్థానికులు తెలిపారు. అదే నీటిని గ్రామ ప్రజలు తాగునీరు, వంట అవసరాలు మరియు గృహ వినియోగానికి ఉపయోగిస్తున్నారనే విషయం బయటపడటంతో ఒక్కసారిగా గ్రామమంతా ఆందోళనకు గురైంది. తాగునీటి సరఫరా వ్యవస్థ నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం చోటుచేసుకుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామ ప్రజలు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్యాంక్‌ను ఖాళీ చేయించి శుభ్రపరిచే చర్యలు చేపట్టారు. అనంతరం నీటి నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పరీక్షల నిమిత్తం పంపినట్లు సమాచారం. కలుషిత నీటిని వినియోగించిన కారణంగా గ్రామ ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, అవసరమైతే మందులు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తాగునీటి ట్యాంకులకు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బలమైన మూతలు ఏర్పాటు చేయడంతో పాటు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన తాగునీటి వనరుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు.. తాగునీటి వనరుల నిర్వహణలో బాధ్యులు జవాబుదారీతనం ప్రదర్శించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# విద్యుత్ శాఖలో అవినీతి బండారం బట్టబయలు


## రూ.25 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన ఏఈ

## బొల్లారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏసీబీ ట్రాప్ విజయవంతం

## కరెంట్ పోల్ పునర్నిర్మాణానికి లంచం డిమాండ్ చేసిన అధికారిపై కేసు నమోదు

**జిన్నారం (బొల్లారం), జూన్ 18(నేటి ప్రస్థానం):** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొల్లారం డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖలో అవినీతి వ్యవహారం వెలుగుచూసింది. ఐడీఏ బొల్లారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) రామకృష్ణారెడ్డి రూ.25 వేల లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, బొల్లారంలోని పీపీఆర్ హాస్పిటల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభం స్థానంలో విద్యుత్ కాంట్రాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఈ ఘటనకు సంబంధించిన అధికారిక ప్రక్రియ పూర్తి చేయడం, పోలీసు కేసు నమోదు కాకుండా చూసే పేరుతో సంబంధిత వ్యక్తి నుంచి ఏఈ రామకృష్ణారెడ్డి రూ.25 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. లంచం ఇవ్వడానికి నిరాకరించిన బాధితుడు మహమ్మద్ ఇఫ్రాజ్ అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ఉచ్చుపన్ని, గురువారం మధ్యాహ్నం ఏఈ రామకృష్ణారెడ్డి రూ.25 వేల లంచం స్వీకరిస్తున్న సమయంలో దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఆయన వద్ద ఉన్న లంచం నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు రసాయన పరీక్షలు నిర్వహించి కేసు నమోదు చేశారు. తదుపరి విచారణలో భాగంగా బొల్లారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తనిఖీలు చేపట్టి పలు పత్రాలను పరిశీలించినట్లు సమాచారం. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ప్రజలకు నిష్పక్షపాత సేవలు అందించాల్సిన ప్రభుత్వ అధికారులు అవినీతికి పాల్పడటం ఆందోళనకరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనతో బొల్లారం విద్యుత్ శాఖలో అవినీతి వ్యవహారాలపై చర్చ మొదలైంది. కాగా, ఈ కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.





Press Note No. 94 Date: 18.06.2026

**ADDL. ASSISTANT ENGINEER, OPERATIONS, TGSPDCL, IDA, BOLLARAM, SANGAREDDY DISTRICT IS IN ACB NET.**

On 18.06.2026 at about 13:25 hours, the Accused Officer (AO) Sri B. Rama Krishna Reddy, Addl. Assistant Engineer (OP), TGSPDCL, IDA, Bollaram, Sangareddy, was caught red-handed near his office while demanding and accepting bribe of ₹25,000 from the complainant for doing an official favour i.e. "not to initiate any action against the complainant who damaged an electrical pole with his car in an accident on 12.06.2026".

The tainted bribe amount of ₹25,000 was recovered from the possession of the AO. The AO has performed his public duty improperly and dishonestly to obtain undue advantage.

Therefore, the AO is being arrested and produced before the Hon'ble II Addl. Spl. Judge for Trial of SPE & ACB Cases Court, at Hyderabad. The case is under investigation. The details of the complainant are withheld for security reasons.

**CALL PHONE NUMBER 1064 (TOLL FREE NUMBER)**
In case of demand of bribe by any Public Servant, the public are requested to contact Toll Free Number of ACB i.e., 1064 for taking action as per Law. ACB Telangana can also be contacted through social media platforms whatsapp (9440446106), facebook (Telangana ACB), X/formerly twitter (@Telangana ACB). The QR Code of ACB is displayed in all Government Offices and prominent public places to contact ACB, Telangana. The name and details of the victim/complainant will be kept secret.

18/6/26
P.R.O,
Anti-Corruption Bureau,
TG, Hyderabad.

# తెలంగాణలో ఆగని వడగాల్పులు.. జూన్ 20 తర్వాతే రుతుపవనాల విస్తరణ

- తెలంగాణలో జూన్ 20 వరకు కొనసాగనున్న పొడి వాతావరణం
- ఉత్తర, తూర్పు జిల్లాలకు మూడు రోజుల పాటు వడగాల్పుల హెచ్చరిక
- సూర్యాపేట జిల్లా మోతేలో 43.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- హైదరాబాద్, భద్రాచలం వరకు విస్తరించిన నైరుతి రుతుపవనాలు
- రాష్ట్రంలో అక్కడక్కడా ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు

తెలంగాణ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన ప్పటికీ, ఎండల తీవ్రత నుంచి ప్రజలకు ఇప్పుడిప్పుడే ఉపశమనం లభించే సూచనలు కనిపించడం లేదు. జూన్ 20వ తేదీ వరకు రాష్ట్రంలోని మెజారిటీ ప్రాంతాల్లో పొడి వాతావరణమే నెలకొంటుందని, రానున్న మూడు రోజుల పాటు ఉత్తర, తూర్పు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా నివేదికల ఆధారంగా ఈ హెచ్చరికలు జారీ అయ్యాయి. బుధవారం ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వడగాల్పులు నమోదయ్యాయి. ఈ క్రమంలో జూన్ 17, 18, 19 తేదీల్లో ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించింది. గడిచిన 24 గంటల్లో సూర్యాపేట జిల్లా మోతేలో అత్యధికంగా 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఖమ్మం జిల్లా ఏడుపాలెంలో 43.5 డిగ్రీలు, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అటు హైదరాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు హైదరాబాద్, భద్రాచలం మీదుగా ప్రయాణిస్తున్నాయి. రానున్న 4-5 రోజుల్లో ఇవి రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించడానికి సానుకూల పరిస్థితులు ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే, ఉత్తర, మధ్య, తూర్పు జిల్లాల్లో రుతుపవనాలు పూర్తిస్థాయిలో విస్తరించడానికి జూన్ 20-21 వరకు సమయం పట్టవచ్చు. ఈ లోగా పలుచోట్ల సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/